సాక్షి
వరంగల్

శుక్రవారం | 27 | డిసెంబర్ | 2024



సీఎం కప్‌కు రె'ఢీ'

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు హనుమకొండలోని జేఎన్ఎస్ సిద్ధమైంది. - 8లో▸



శిక్షణ పూర్తి .. ఇక విధుల్లోకి..

4వ బెటాలియన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న టీజీఎస్పీ స్పెషల్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ నేడు నిర్వహించనున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29^0 / 19^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురుస్తాయి. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఖోఖో టోర్నీ నిర్వహణకు రూ.5 లక్షల సాయం



గీసుకొండ: మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి, స్వప్న దంపతులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల నిర్వహణకు రూ. 5 లక్షల సాయం చేయడానికి ముందుకు వచ్చారు. గురువారం మొదటి విడతగా రూ. 2 లక్షల నగదును టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కోట రాంబాబుకు అందించగా మిగతా సాయాన్ని టోర్నీ నిర్వహణ సందర్భంగా క్రీడాకారులకు భోజనాలు, ఇతర అవసరాలకు అందజేస్తానని బాలకిశోర్‌రెడ్డి తెలిపారు. గీసుకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జనవరి 8 నుంచి 11వ తేదీ వరకు 57వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నారు. గీసుకొండకు చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు వీరగోని రాజ్‌కుమార్ చొరవ మేరకు కిశోర్‌రెడ్డి దంపతులు సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు బాలకిశోర్‌రెడ్డి దంపతులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దొడు రాజేశ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి రాష్ట్ర స్థాయి నాటక పోటీలు

హసన్‌పర్తి: పందిళ్ల శేఖర్‌బాబు స్మారక రాష్ట్ర స్థాయి నాటకోత్సవ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈపోటీలు నాలుగురోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 55వ డివిజన్ భీమారంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ, చలన చిత్రాభివృద్ధి సంస్థ సౌజన్యంతో ఈపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొంటున్నట్లు.. ముగింపు కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

'ఓపెన్'లో ప్రవేశాలకు 30 వరకు గడువు

విద్యారణ్యపురి: 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈనెల 30 వరకు గడువు ఉందని, ఆసక్తిగల ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థులు ప్రవేశాలు పొందాలని హనుమకొండ డీఈఓ డి వాసంతి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ అనగోని సదానందం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ జిల్లాలోని సమీపంలోని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల అధ్యయన కేంద్రాలను సంప్రదించాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.అభ్యర్థులే స్వయంగా అడ్మిషన్ ఫీజు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్ స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ ద్వారా చెల్లించి రసీదు పొంది సమీప అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ ఫామ్ ప్రింట్‌తోపాటు వెంటనే ఈనెల 31న సమర్పించాల్సింటుందన్నారు. పూర్తి వివరాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ అనగోని సదానందం సెల్ నంబర్లను (9346020003), (9396337572) సంప్రదించాలని వారు కోరారు.

రుద్రేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వర స్వామికి గురువారం బిహార్ రాష్ట్ర షుగర్ కేన్ ఇండ్రస్టీస్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ ఈఓ వెంకటయ్య, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. పీఎస్ విజయలక్ష్మి రుద్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

హన్మకొండ చౌరస్తా/హసన్‌పర్తి : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ అంబర్‌కిషోర్‌ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ బ్రాంచ్ ఎస్సై బి.మాధవ్, ఏనుమాముల పీఎస్ ఎస్సై పి.శ్రీకాంత్‌ను హనుమకొండ పోలీస్ డివిజన్ పరిధి కాకతీయ యూనివర్సిటీ పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు.

భావితరాలకు మేలు కలిగేలా..

- మాస్టర్ ప్లాన్‌లో రైల్వే లైన్లకు సమీపాన ఉన్న నష్కల్, హసన్‌పర్తి ప్రాంతాల్లో భారీ డ్రై పోర్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. యూరియా, సిమెంట్, ఉక్కు, గ్రానైట్ దిగుమతి, ఎగుమతికి అవకాశం కల్పించనున్నారు. రైల్వే వ్యాగన్‌కు అనుసంధానం చేయనున్నారు.
- హైదరాబాద్ టు వరంగల్ వరకు ఇండస్ట్రియల్ కారిడార్ మడికొండ, రాంపూర్ శివారులో ప్రతిపాదించారు. నర్సంపేట రోడ్డులోని కాకతీయ మెగా జౌళి పార్కు. ఇక మూడోది వ్యవసాయ ఆధారిత ప్రాంతాలున్నా గీసుకొండ, గొర్రెకుంట, ప్రాంతాల్లో జిన్నింగ్, రైస్ మిల్లులు ఉన్నందున ఇతర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ప్రాంతాలుగా ఖరారు చేశారు.
- హసన్‌పర్తి–కరీంనగర్ రోడ్డులో ప్రైవేట్ అండ్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్(పీపీపీ)పద్ధతిన ఐటీ హబ్ ఏర్పాటు.
- కరీంనగర్ రోడ్డు, ఖమ్మం హైవే రోడ్లలో విద్యాసంస్థలు అభివృద్ధి చేయాలనుకున్నప్పటికీ ఇప్పటికే పలు విద్యాసంస్థలు ఉన్నాయి.
- ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఉపయోగపడేలా కొత్తపేట గ్రామంలో ట్రక్ అండ్ టర్మినల్ ఏర్పాటు.
- పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ జోన్ కింద మామునూరు, పింఛన్‌పుర, సింగారం శివారులో ప్రతిపాదించారు. నిబంధనల ప్రకారం నివాస, వాణిజ్య భవనాలు లేఅవుట్లకు అనుమతులు ఇవ్వరు. కేవలం ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. దీనిపైనా పునరాలోచన జరుగుతున్నట్లు చెబుతున్నారు.

న్యూఇయర్.. ప్లాన్..!



- చేర్పులు, మార్పులతో సిద్ధం
- ఇప్పటికే జారీ అయిన ఉత్తర్వులు
- సీఎం దృష్టికి కొత్త ప్లాన్ అంశాలు
- ప్రజాప్రతినిధులతో ముగిసిన ఇన్‌చార్జ్ మంత్రి 'పొంగులేటి' సంప్రదింపులు
- 2025 జనవరి నుంచి అమలు చేసే అవకాశం..?
- సంబంధిత అధికారులతో సమాలోచనలు

'గ్రేటర్ వరంగల్'కు మాస్టర్‌ప్లాన్ - 2041

ప్రత్యేకతలు ఇవీ

జియో గ్రాఫిక్ ఇన్ఫరేషన్ సిస్టమ్(జీఐఎస్) విధానం ద్వారా మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేశారు.

- గతంలో అడ్డంకులున్న కాజీపేట, హనుమకొండ, వరంగల్ నివాస, వాణిజ్య భవన నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.
- కొత్తగా గ్రోత్ కారిడార్ ప్రతిపాదించారు. ప్రాంతీయ, బాహ్య అంతర్ వలయ రహదారుల పక్కన టౌన్‌షిప్‌లు ఏర్పాటు కానున్నాయి. అందుకు 100, 150, 200 ఫీట్ల రహదారులు అమల్లోకి వస్తాయి.
- కొత్తగా మిక్స్‌డ్ ల్యాండ్ యూజ్ జోన్ ప్రతిపాదించారు. అందుల్లో 60, 80, 100, 150, 200 ఫీట్ల రోడ్లను ప్రతిపాదించారు. నివాస, వాణిజ్య పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వనున్నారు.
- అంతేకాకుండా నగరానికి 35 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఔటర్‌తో పాటు ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపకల్పన చేశారు. 2050 అవసరాలకు తగ్గట్టుగా ఇది ఉపయోగపడనుంది. కాగా మాస్టర్‌ప్లాన్ అమల్లోకి వస్తే వరంగల్ మెట్రో నగరాల స్థాయికి ఎదగనుండగా.. కొత్తగా ఏర్పాటు చేసే జోన్లు, గ్రోత్ కారిడార్, మిక్స్‌డ్ ల్యాండ్ యూజ్ జోన్లు ఎంతగానో ఉపకరించనున్నాయి.

సాక్షిప్రతినిధి, వరంగల్: ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న గ్రేటర్ వరంగల్ మాస్టర్‌ప్లాన్- 2041 కొత్త సంవత్సరం నుంచే అమల్లోకి రానుంది. ఇప్పటికే వరంగల్ మాస్టర్ ప్లాన్-2041కి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నవంబర్ 19న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు ఒక్కరోజు ముందు.. ఎన్నో ఏళ్లుగా నానుతున్న ఈ కొత్త మాస్టర్ ప్లాన్‌ను ఆమోదిస్తూ జీఓ 202 జారీ చేసింది. అయితే గ్రేటర్ వరంగల్‌తో పాటు 19 మండలాల పరిధి 181 గ్రామాలు 'కుడా' పరిధిలోకి రాగా.. మొత్తంగా 1,805 చదరపు కిలోమీటర్ల మేర విస్తరింపుతో నూతన మాస్టర్‌ప్లాన్‌కు ఆమోదం లభించింది. కొద్దిపాటి చేర్పులు, మార్పులతో సిద్ధమైన మాస్టర్‌ప్లాన్‌పై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి 'గ్రేటర్' పరిధిలోని శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులతో ఇటీవలే ఫైనల్‌గా సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన అంశాలను సీఎం రేవంత్‌రెడ్డికి కూడా తీసుకెళ్లడంతో 2025 జనవరిలో ఈ మాస్టర్‌ప్లాన్ అధికారికంగా అమల్లోకి వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

కాకతీయ రీజినల్ రింగ్ రోడ్డు.. ఔటర్ రింగ్‌రోడ్డు

మాస్టర్ ప్లాన్‌లో సరికొత్త, అత్యంత ప్రాధాన్యం ఉన్న అంశం కాకతీయ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపకల్పన చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ వద్ద మొదలై జఫర్‌గఢ్, వర్ధన్నపేట, సంగెం, గీసుకొండ, ఆత్మకూరు, దామెర, కమలాపూర్, ఎల్కతుర్తి, వేలేరు, చిల్పూరుగుట్ట నుంచి తిరిగి స్టేషన్‌ఘన్‌పూర్‌కు సుమారు 150 కిలోమీటర్ల మేరకు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. ఈ మండలాల మధ్య ఉన్న రహదారులను అనుసంధానించడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఉండవు. మొత్తంగా ఈ ప్రణాళిక వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల వరకు విస్తరించనుంది. అలాగే.. నగర శివారులో ఔటర్ రింగ్‌రోడ్డు కింద హైదరాబాద్–ఏటునాగారం జాతీయ రహదారి వరకు.. హైదరాబాద్ రోడ్డు కరుణాపురం నుంచి ధర్మాపురం, అయినవోలు, పున్నేలు, బొల్లికుంట, గాడిపల్లి, వంచనగిరి, ధర్మారం, పోతరాజుపల్లి, మొగిలిచర్ల, కొత్తపేట, దామెర క్రాస్‌రోడ్డు వరకు వెంటనే పూర్తి చేసేందుకు ప్రతిపాదించారు.

- ఇవేకాకుండా నగరం చుట్టూరా ఉన్న 13 రేడియల్ రోడ్లను అభివృద్ధి చేసి ఇన్నర్, ఔటర్, రీజినల్ రింగ్ రోడ్లకు అనుసంధానం చేయనున్నారు. నగర నడిబొడ్డు నుంచి ఎటువైపు నుంచైనా వెళ్లేందుకు రేడియల్ రోడ్ల నిర్మాణంతో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుంది.
- ధర్మసాగర్–ఎలుకుర్తి గ్రామాల సమీపంలో 220 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. వంద ఎకరాల్లో సైనిక్ స్కూల్, భట్టాచర్య తదితర ఏర్పాటు, మిగిలిన 120 ఎకరాల్లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాలు.
- దేవునూరు–ముప్పారం 200 ఎకరాల స్థలంలో థీమ్ పార్కు, ఇనుపరాతి గుట్టలను పర్యాటక ప్రదేశంగా మొత్తాన్ని కలిపి రిక్రియేషన్ జోన్‌గా ప్రతిపాదించినట్లు తెలిసింది.

పీవీకి వెన్నుదన్నుగా మన్మోహన్

ఆయన మృతితో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన ఉమ్మడి జిల్లా ప్రజలు

- ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో సంయమనం..
- వరంగల్ పోరాటాలపై ఆరా... ఆయన హయాంలోనే ప్రత్యేక రాష్ట్రం



మన్మోహన్ సింగ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, వరంగల్: కాంగ్రెస్ సీనియర్ నేత, దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి ఉమ్మడి వరంగల్ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ వర్గాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. నిస్వార్థ రాజకీయ, ఆర్థిక వేత్తగా పేరు సంపాదించిన మన్మోహన్‌సింగ్... హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర ముద్దుబిడ్డ, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కేబినెట్‌లో కీలకంగా వ్యవహరించారు. దేశ వ్యాప్తంగా ఈ రోజు అభివృద్ధి చెందుతున్న అనేక నగరాలకు బీజం వేసింది పీవీ, మన్మోహన్ సంస్కరణలే. హైదరాబాద్ తర్వాత తెలంగాణలో రెండో నగరమైన వరంగల్ అభివృద్ధికి శ్రీకారం జరిగింది కూడా మన్మోహన్‌సింగ్ హయాంలోని అని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్లతో మాట్లాడి పరిస్థితి తెలుసుకొని సోనియాగాంధీ దృష్టికి తీసుకెళ్లడంలో ప్రముఖ పాత్ర వహించారన్న పేరుంది.

పీవీ అడుగు జాడల్లో...

పీవీ నరసింహారావు ప్రధాని కాగానే... 1991 జూన్ 21న కేంద్ర ఆర్థిక మంత్రిగా మన్మోహన్‌సింగ్ ఆయన కొలువులో చేరారు. పలు కీలక సంస్కరణలకు కేంద్ర బిందువు అయ్యారు. ఒక దశలో మన్మోహన్ చొరవ వల్లే మైనార్టీ ప్రభుత్వంగా ఉన్న పీవీ 1991 నుంచి 1996 వరకు పరిపాలన సాగించారంటారు.

పలువురి సంతాపం..

మన్మోహన్‌సింగ్ మృతికి వరంగల్ ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు. ఉద్యమ తీవ్రతను గుర్తించి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు విషయంలో కృషి చేసిన వారిలో ఆయన పాత్ర మరువలేనిదని కొనియాడారు.

కొనసాగుతున్న 'ఇందిరమ్మ' సర్వే

వరంగల్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల స ర్వే కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 మండలాలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్, రెండు మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,33, 333 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ సర్వేను జిల్లాలో ఈనెల 9న లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటి వరకు సర్వేలో 86,632 కు టుంబాలను గుర్తించి యాప్‌లో నిక్షిప్తం చేశారు.

జిల్లాలో వచ్చిన దరఖాస్తులు, పూర్తిచేసినవి, యాప్‌లో నమోదు చేసిన వాటి వివరాలు..

మండలం	దరఖాస్తులు	సర్వేపూర్తి	యాప్‌లో నమోదు
రాయపర్తి	16,166	7,916	944
చెన్నారావుపేట	12,042	4,707	3,940
దుగ్గొండి	13,028	6,701	6,052
గీసుకొండ	11,897	6,160	5,413
ఖానాపురం	10,623	5,925	5,330
నల్లబెల్లి	11,870	6,153	4,981
నర్సంపేట	12,971	5,103	4,374
నెక్కొండ	16,410	8,667	7,855
పర్వతగిరి	13,341	7,425	6,877
సంగెం	13,499	5,667	4,566
వర్ధన్నపేట	10,026	4,256	3,961
నర్సంపేట మున్సిపాలిటీ	8,296	3,855	3,621
వర్ధన్నపేట మున్సిపాలిటీ	3,665	2,195	2,086
జీడబ్ల్యూఎంసీ	79,499	22,491	20,604
	23,33,33	97,221	86,632

లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలి

జిల్లా నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన 35, 38వ డివిజన్లలోని శివనగర్, ఖిలావరంగల్ ప్రాంతాల్లో జరుగుతున్న సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. డివిజన్లలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఇంతవరకు ఎన్ని సర్వే చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అధికారులకు సర్వే తీరుపై పలు సూచనలు చేశారు. డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, రెవెన్యూ అధికారి శ్రీనివాస్, మెప్మా టీఎంసీ రమేశ్, అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- లక్నేపల్లి గ్రామంలో ఘటన



కారు ఢీకొని నుజ్జునుజ్జయిన బైక్



శివరాజ్‌కుమార్ (ఫైల్)





తీవ్ర గాయాలైన అభిరామ్, శేషు

నర్సంపేట రూరల్: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన లక్నెపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. భూపాలపల్లికి చెందిన తోట శివరాజ్ కుమార్ అలియాస్ జెట్లి (20), కరీంనగర్‌కు చెందిన అభిరామ్, ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌కు చెందిన శేషు నర్సంపేట మండలంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. లక్నెపల్లిలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ కళాశాలకు వెళ్తున్నారు. రాత్రి సమయంలో లక్నెపల్లి నుంచి హాస్టల్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. లక్నెపల్లి బస్టాండ్ సమీపంలోకి రాగానే వరంగల్ నుంచి నర్సంపేట వైపు వస్తున్న కారు వెనుక నుంచి వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు ఎగిరిపడ్డారు. దీంతో తోట శివరాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన శేషు, అభిరామ్‌ను స్థానికులు 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు. శివరాజ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. నర్సంపేట ఎస్సై గూడ అరుణ్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. దీనిపై ఎస్సైని వివరణ కోరగా ముగ్గురు నర్సంపేట మండలంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నారు. అందులో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఫిర్యాదు అందగానే కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామన్నారు.

ఆపదలో ఆదుకున్న అంబేద్కర్

నర్సంపేట: రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో నాగుర్లపల్లికి చెందిన అంబేద్కర్ అనే యువకుడు 108కు సమాచారం అందించాడు. క్షతగాత్రులను స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించాడు. ఆ సమయంలో ప్రమాద కారకులు కారులో పారిపోతుండగా పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. కాగా, ఈనెల 11న మండలంలోని మాదన్నపేట చెరువులోకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా.. మరో యువకుడు చెరువులో మునిగిపోతుండగా సహసోపేతంగా ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపాడిన అంబేద్కర్‌ను పలువురు స్థానికులు అభినందించారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

చెన్నారావుపేట: సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ మోహన్‌కాంత్, యుబీఐ లీడ్ బ్యాంకు ఎఫ్ఎల్‌సీ జిల్లా కౌన్సిలర్ భాస్కరాచారి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శ్రీ ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్‌పర్సన్ కళ్లెపు శోభారాణి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు, వ్యాపారులు, యువకులు, విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సామాజిక భద్రత పథకాలపై అవగాహన కల్పించారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్

విద్యుత్ సమస్యల నివారణకు టీజీఎన్పీడీసీఎల్ ముందస్తు ప్రణాళిక

- అధిక లోడ్ మేరకు సబ్ స్టేషన్ల సామర్థ్యం పెంపు
- అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- రూ.5.50 కోట్లతో వరంగల్ సర్కిల్.. రూ.9.95 కోట్లతో హనుమకొండ సర్కిల్‌లో పనులు



హన్మకొండ: వేసవిలో డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా చేసేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. విమర్శలకు తావు లేకుండా ఉండేందుకు ఇప్పటి నుంచే అధికారులు అప్రమత్తమయ్యారు. గతేడాది డిమాండ్ దృష్ట్యా ఈ ఏడాదిలో పెరిగిన విద్యుత్ సర్వీస్ ప్రకారం వేసవి యాక్షన్ ప్లాన్ రూపొందించారు. డివిజన్ల వారీగా డిమాండ్, సరఫరాను లెక్కించి రాబోయే వేసవిలో ఎంత మేరకు డిమాండ్ ఉంటుందో అంచనాకు వచ్చి ఈ మేరకు ఏఏ ఏర్పాట్లు చేయాలో ఎస్ఈలు, డీఈలు, ఏడీఈ, ఏఈలు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అంతరాయాలు తగ్గించేందుకు ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేస్తున్నారు. అత్యవసర సర్వీసులైన ఆస్పత్రి, మెడికల్ కాలేజీలు, పోలీస్ స్టేషన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు. నిర్దిష్టమైన కార్యాచరణ ద్వారా వేసవిలో వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన, విద్యుత్ సరఫరా అందించేందుకు యాజమాన్యం, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ (పట్టణాలు, నగరంలో)లలో విద్యుత్ సరఫరాలో సమస్య ఏర్పడినప్పుడు అంతరాయాలు లేకుండా ఉండేందుకు వ్యవస్థను పటిష్ట పరుస్తూ, 11కేవీ ఫీడర్లకు ప్రత్యామ్నాయ ఫీడర్లు ఏర్పాట్లు చేశారు.

హనుమకొండ సర్కిల్‌లో నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం

హనుమకొండ సర్కిల్‌లో రూ.9.95 కోట్లతో ప్రత్యేకంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించారు. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో మొదటిసారిగా ఇండోర్ సబ్ స్టేషన్‌ను నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. కడిపికొండలో రూ.6.05 కోట్ల అంచనాతో నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ప్రారంభించి విద్యుత్ సరఫరాను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో పాటు కొత్తగా హనుమకొండ వాజ్‌పేయినగర్‌లో రూ.6 కోట్లతో, హనుమకొండ ప్రసూతి ఆస్పత్రిలో రూ.7.64 కోట్ల అంచనాతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. అదే విధంగా న్యూ శాయంపేటలోని డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో రూ.7 కోట్ల అంచనాతో చేపట్టిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కొనసాగుతుంది. సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపులో భాగంగా హనుమకొండ నక్కలగుట్ట సబ్ స్టేషన్‌లో 8 మెగావాట్స్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో రూ.2.35 కోట్లతో 12.26 మెగా వాట్స్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. యాదవనగర్ సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఏ స్థానంలో రూ.1.09 కోట్లతో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ధర్మాపూర్ సబ్ స్టేషన్‌లో అదనంగా రూ.90 లక్షలతో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా 127 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతున్నారు. వీటికి తోడు అదనంగా 109 విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. రూ.4.52 కోట్లతో సబ్ స్టేషన్ల మధ్య ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు నిర్మిస్తున్నారు.

వరంగల్ సర్కిల్‌లో

వరంగల్ సర్కిల్‌లో రూ.5.50 కోట్లతో వేసవి ముందస్తు ప్రణాళిక రూపొందించారు. పోచమ్మమైదాన్ సబ్ స్టేషన్‌లో అదనంగా మరో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. శంభునిపేట సబ్ స్టేషన్‌లో 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్, ఆజంజాహి మిల్ సబ్ స్టేషన్‌లో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఓవర్ లోడ్‌ను ఎదుర్కొనేందుకు ప్రస్తుతమున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో అధిక సామర్థ్యమున్న ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు. వీటిని ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి చేయాలని అదే విధంగా అవసరమైన చోట అదనపు విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించుకుని అధికారులు ముందుకు పోతున్నారు.

డిమాండ్ దృష్ట్యా ప్రత్యేక కార్యాచరణ



గతేడాది వేసవి డిమాండ్ దృష్ట్యా సాంకేతికంగా విశ్లేషించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకున్నాం. అవసరమైన చోట సబ్ స్టేషన్ల సామర్థ్యం పెంచుతున్నాం. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపుతో పాటు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం. విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు నిర్మిస్తున్నాం. ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.

- మధుసూదన్ రావు, ఎస్ఈ, వరంగల్ సర్కిల్

అంబులెన్స్‌ల ఆకస్మిక తనిఖీ

హన్మకొండ అర్బన్: జిల్లాలోని 108, 102, నవజాత శిశు అంబులెన్స్‌లను ఈఎంఆర్ఐ హైదరాబాద్ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ రాష్ట్ర హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ హెడ్ కిరణ్ కిశోర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి చలికాలంలో సంభవించే ప్రమాదాల నుంచి రక్షణ ఎలా కల్పించాలి.. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను అత్యంత తక్కువ సమయంలో ఘటనాస్థలికి చేరుకుని ఎలా కాపాడాలో సూచనలందించారు. నవజాత శిశువులకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి, గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థకు మంచి పేరు తీసుకొచ్చేలా ప్రతీ ఉద్యోగి పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, జిల్లా మేనేజర్ లక్ష్మణ్, 108, 102 ఉద్యోగులు పాల్గొన్నారు.

అవ్వకు ఆదరణ కరువు



ఎముకలు కొరికే చలి ఓవైపు. రణగొణ ధ్వనులు మరోవైపు. దోమలు, ఈగలు, కుక్కలకైతే లెక్కే లేదు. వీటన్నింటి మధ్య ఓ మాతృమూర్తి గజగజా వణుకుతూ కాలం వెళ్లదీస్తోంది. ఎక్కడి నుంచి వచ్చిందో.. ఎవరు తీసుకొచ్చి వదిలేశారో తెలియదు. అడుగు తీసి అడుగేయలేని పరిస్థితి. బాటసారులు, పండ్ల వ్యాపారులు ఇచ్చే పదార్థాలు తిని బతుకుతోంది. కాజీపేట త్రిబుల్ ఎస్ కాంప్లెక్స్ ఎదుట ఉన్న గేట్ వాల్వ్ నీటిని తాగుతూ.. కాలకృత్యాలు తీర్చుకుంటోంది. కడుపు నింపుకోడానికి వణుకుతున్న చేతిని చాచిన ఆ అవ్వను 'సాక్షి' పలుకరించగా.. తన పేరు లచ్చమ్మ అని మాత్రం చెప్పింది. వివరాలేమీ వెల్లడించలేదు. ఆదరణ కరువైన ఆ అవ్వను కుటుంబ సభ్యులు వచ్చి తీసుకెళ్లాలని స్థానికులు కోరుతున్నారు.

- కాజీపేట

దంపతుల మధ్య గొడవ..

క్షణికావేశంలో ఇద్దరూ ఆత్మహత్య

- అనాథలుగా మారిన పిల్లలు
- గిర్మాజీపేట లక్ష్మీపురంలో ఘటన



రమేశ్ మృతదేహం



తిరుపతమ్మ మృతదేహం

వరంగల్: ఏదో తెలియని సమస్యపై దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈ సమయంలో ఇద్దరూ క్షణికావేశానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈఘటన వరంగల్ గిర్మాజీపేట లక్ష్మీపురంలో చోటు చేసుకుంది. ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకుర్, స్థానికుల కథనం ప్రకారం.. లక్ష్మీపురానికి చెందిన ఓని రమేశ్(35), తిరుపతమ్మ(30) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు గౌతమ్, గణేశ్ సంతానం. ఈ క్రమంలో రమేశ్ రోజూ వివిధ కారణాలతో భార్యతో గొడవ పడేవాడు. బుధవారం రాత్రి కూడా గొడవ చేయడంతో జీవితంపై విరక్తి చెందిన తిరుపతమ్మ.. పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. భార్య చనిపోవడంతో భయపడిన రమేశ్ కూడా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, దంపతులు ఆత్మహత్యకు పాల్పడడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. వీరిని చూసి స్థానికులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈఘటపై మృతుడి సోదరుడు ఎల్లస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు.

సీఎం కప్‌కు రె'ఢీ'..

- జేఎన్ఎస్ వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు
- నేటి నుంచి జనవరి 2వ తేదీ వరకు
- నాలుగు ఆటలు.. వెయ్యిమంది క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం రె'ఢీ' అయ్యింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు భోజన, ఇతర వసతులతో పాటు స్టేడియంలో అన్నీ ఏర్పాట్లు చేశారు. ఈ నెల 7వ తేదీన గ్రామ స్థాయిలో ప్రారంభమైన క్రీడా పోటీలు.. మండల, జిల్లా స్థాయిలో ముగిశాయి. చివరి దశలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హనుమకొండ జిల్లా వేదిక కానుంది. ఐదు క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు.

నాలుగు క్రీడాంశాల్లో పోటీలు..

రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే జిమ్నాస్టిక్స్ పోటీలు నిర్వహించగా నేటి నుంచి (డిసెంబర్ 27) జనవరి 2వ తేదీ వరకు హ్యాండ్‌బాల్, సెపక్‌తక్రా, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగనున్నాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వెయ్యి మంది క్రీడాకారులు, 250 మంది టెక్నికల్ అఫిషీయల్స్, కోచ్‌లు, మేనేజర్లు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. నాలుగు క్రీడాంశాల్లో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు హసన్‌పర్తి సమీపంలోని ఎర్రగట్టు గుట్ట వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో కొనసాగనున్నాయి. మిగతా అథ్లెటిక్స్ , సెపక్‌తక్రా, హ్యాండ్‌బాల్ పోటీలు జేఎన్ఎస్‌లో నిర్వహించనున్నట్లు డీవైఎస్‌ఓ తెలిపారు.



బాలసముద్రంలోని ప్రభుత్వ గిరిజన వసతి గృహానికి చేరుకుంటున్న క్రీడాకారులు

క్రీడాకారులకు వసతుల ఏర్పాట్లు..

వివిధ జిల్లాల నుంచి హనుమకొండకు చేరుకున్న క్రీడాకారులకు జేఎన్ఎస్, ఇండోర్ స్టేడియంతో పాటు గిరిజన, బీసీ వసతి గృహాలు, ఆనంద నిలయాల్లో భోజన, ఇతర వసతులు ఏర్పాట్లు చేశారు.

గెలుపొందిన క్రీడాకారులకు భారీ నజరానా..

సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రభుత్వం భారీగా నజరానా అందజేయనుంది. విజేతకు రూ. లక్ష, రన్నరప్‌కు రూ.75వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.50 వేల నగదు పురస్కారాన్ని అందజేయనుంది. వ్యక్తిగత విభాగాల్లో విజేతకు రూ.20వేలు, రన్నరప్‌కు రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన క్రీడాకారుడికి రూ.10వేల నగదు పురస్కారం అందజేయనుంది. కాగా, ఐదు రోజుల క్రీడా పండుగను శుక్రవారం ఉదయం 9గంటలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి హాజరై ప్రారంభించనున్నట్లు డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ తెలిపారు.



వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారుల పేర్లను నమోదు చేసుకుంటున్న డీఎస్‌ఏ సిబ్బంది

30 నుంచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

వరంగల్: గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా ఈనెల 30 నుంచి జనవరి 2 వరకు వరంగల్ ఓసిటీ మైదానం సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు సర్వం సిద్ధమైనట్లు డీవైఎస్‌ఓ సత్యవాణి తెలిపారు. ఇందులో పాల్గొంటున్న రెండు లక్షల మందికి పైగా క్రీడాకారుల సమాచారాన్ని గేమ్స్ మేనేజ్‌మెంట్ సిస్టంలో సంక్షిప్తం చేసినట్లు చెప్పారు. పారా క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించడం సీఎం కప్ పోటీల్లో మరో ప్రత్యేకత అన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు సత్యవాణి పేర్కొన్నారు.

నకిలీ మిర్చి విత్తనాలతో మోసం

- తీవ్రంగా నష్టపోయిన గిరిజన రైతులు
- వైరా నర్సరీపై చర్యలకు డిమాండ్



దొడ్డురకం మిరపకాయలను చూపుతున్న రైతులు

గార్ల: నకిలీ మిర్చి విత్తనాలతో పంట సాగు చేసి గిరిజన రైతులు మోసపోయారు. కాయలు సన్నరకం బదులు దొడ్డుగా కాయడంతో తీవ్రంగా నష్టపోయారు. ఈ ఘటన గార్ల మండలం కేశోత్‌తండాలో జరిగింది. ఈ మేరకు తండాకు చెందిన భూక్యా మోహన్, కేశోత్ బుజ్జి, భూక్యా వీరన్న, కేశోత్ మున్ని, కేశోత్ నరేశ్ గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించిన బోరున విలపించారు. సదరు రైతులు వేలాది రూపాయలు వెచ్చించి ఖమ్మం జిల్లా వైరాలోని లోకేశ్వరి మిర్చి నర్సరీ నుంచి మిరప నారు కొనుగోలు చేసి సాగు చేపట్టారు. ప్రస్తుతం తోట కాతకు రాగా కాయలు సన్నరకం బదులు దొడ్డుగా కాశాయి. తోటలో సుమారు 50శాతం దొడ్డురకం కాయడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తాము సాగు చేసిన మిర్చితోటలను సందర్శించి, వైరా నర్సరీ యజమాని నుంచి పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే, అదే గ్రామానికి చెందిన కేశోత్ సురేశ్, గుగులోత్ కిషన్.. ఖమ్మంలోని ఓ విత్తన దుకాణం నుంచి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేశారు. వీరి తోటల్లో కూడా దొడ్డు రకం కాశాయని, తమకు కూడా పరిహారం చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏఓ కావటి రామారావును 'సాక్షి' వివరణ కోరగా జన్యు స్వచ్ఛత నిర్ధారణ కోసం శాస్త్రవేత్తలను పిలిపించి ఈ మిర్చితోటలను పరిశీలించాక జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు నివేదికను పంపనున్నట్లు వెల్లడించారు.

శిక్షణ పూర్తి.. ఇక విధుల్లోకి

నేడు టీజీఎస్పీ కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్

- మామునూరు బెటాలియన్‌లో ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 9గంటలకు పాసింగ్ అవుట్ పరేడ్ ప్రారంభం
- హాజరుకానున్న టీజీఎస్పీ అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్



దీక్షాంత్ పరేడ్‌కు ముస్తాబవుతున్న వేదిక ప్రాంగణం

మామునూరు: మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 457మంది టీజీఎస్పీ కానిస్టేబుళ్లు సమాజానికి సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నారు. 9నెలలపాటు కఠోర శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న శిక్షణార్థులు.. రేపటి నుంచి సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు అంకితం కానున్నారు. శుక్రవారం ఉదయం 9గంటలకు టీజీఎస్పీ బెటాలియన్ మైదానంలో టీజీఎస్పీ కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ జరగనుంది. ఈమేరకు బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాశ్ ఆధ్వర్యంలో పరేడ్ నిర్వహణకు గురువారం సాయంత్రం ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరేడ్ మైదానాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశా రు. ఈ కార్యక్రమానికి టీజీఎస్పీ అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా, అతిథులుగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, డీసీపీ రవీందర్ హాజరు కానున్నారు. కాగా, దీక్షాంత్ పరేడ్ అనంతరం ఆయా జిల్లాలోని ఎస్పీలకు టీజీఎస్పీ స్పెషల్ కానిస్టేబుళ్ల జాయినింగ్ రిపోర్ట్ అందజేయాల్సి ఉంటుందని కమాండెంట్ రాంప్రసాద్ తెలిపారు.

పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అశోక్ రావత్



సమావేశానికి హాజరైన టీజీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

- ఆల్ ఇండియా ఎజిటేషన్ కమిటీ అధ్యక్షుడు అశోక్ రావత్

హన్మకొండ కల్చరల్ : అతితక్కువ పెన్షన్‌తో రిటైర్డ్ ఉద్యోగులు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.. ఈపీఎస్95 పెన్షన్‌దారుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆల్ ఇండియా నేషనల్ ఎజిటేషన్ కమిటీ అధ్యక్షుడు, కమాండర్ అశోక్ రావత్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఈపీఎస్95 పెన్షన్‌దారుల మహాసభలో ఆయన మాట్లాడారు. పెన్షన్‌దారులు తమ సమస్యలపై కొంత కాలంగా పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. పెన్షన్ మినిమం రూ.7,500, డీఏ ఇవ్వాలని, జీవిత భాగస్వాములకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, ఈపీఎస్ 95 స్కీంకు ఆప్షన్ ఇవ్వడంతోపాటు రిటైర్డ్ ఉద్యోగికి నెలకు రూ.5వేలు చెల్లించాలన్నారు. టీజీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వరంగల్, ఎస్ఏసీ సభ్యుల ఆధ్వర్యాన టీజీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి పి.యల్.యస్.రావు, కార్యనిర్వహక అధ్యక్షుడు నర్సింగరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నారాయణ, మాధవరావు, లక్ష్మన్న కరవేది, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సైకిల్‌ను ఢీకొన్న బైక్..

- వ్యక్తి మృతి, వాహనదారుడికి తీవ్రగాయాలు



కొమ్మాలు (ఫైల్)

సంగెం: బైక్.. సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఓ వ్యక్తి (సైకిలిస్ట్) మృతి చెందగా ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం సంగెం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎలూర్‌రంగంపేటకు చెందిన ఇమ్మడి కొమ్మాలు(60) సపావట్ తండాకు చెందిన బాదవత్ బాలుకు వ్యవసాయ పనులకు జీతం ఉన్నాడు. రోజు వారీ పనుల్లో భాగంగా సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో తిమ్మాపూర్‌లోని బృహత్ పల్లెప్రకృతి వనం ముందు చంద్రుగొండకు చెందిన చిలువేరు శ్యామ్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ సైకిల్‌ను ఢీకొనగా కొమ్మాలు అక్కడికక్కడే మృతి చెందాడు. శ్యామ్‌కు తీవ్రంగా, వెనుక కూర్చున్న శ్యామ్ బంధువు ప్రత్యూషకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై మృతుడి భార్య అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ఖాసీం పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలోనే తండ్రి, తనయుడి మృతి..

అమృత, కొమ్మాలు దంపతులకు కుమార్, మమత, సమత, సంధ్య, శ్రావణి, సంతోశ్ సంతానం. పెద్ద కుమారుడు కుమార్ గతంలో ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందాడు. ప్రస్తుతం తండ్రి కూడా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీయ్యారు. రెక్కాడితేనే డొక్కాడని కుటుంబానికి పెద్ద దిక్కు కొమ్మాలు మృతి చెందడంతో కుటుంబీకులు దహన సంస్కారాలు కూడా చేయలేని దుస్థితిని చూసి బంధువులు, గ్రామస్తులు కంటతడిపెట్టారు.

డిటెన్షన్ విధానాన్ని విరమించుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను

కురవి: నూతన విద్యావిధానం పేరుతో పాఠశాల విద్యలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న డిటెన్షన్ విధానాన్ని విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కురవిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 5, 8వ తరగతుల్లో డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల డ్రాపౌట్స్ పెరుగుతారని, పేద పిల్లలు, ప్రభుత్వ పాఠశాలలే నష్టపోతాయని తెలిపారు. ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో ఉన్నత విద్యలో ప్రవేశించే వారు కేవలం 23 శాతం ఉంటే ఎస్సీల్లో 11.6శాతం, ఎస్టీల్లో 7.3శాతం మాత్రమే ఉన్నారన్నారు. దేశ అక్షరాస్యత 74.04 శాతం ఉందన్నారు. ఈ నిర్ణయం వల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువుకు దూరమవుతారని, బాలిక విద్య మరింత దిగజారుతుందన్నారు. కేవలం మార్కులు, గ్రేడ్లతో విద్యార్థుల జ్ఞానాన్ని కొలవడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, సహాయ కార్యదర్శి దామెర కిరణ్, నాయకులు పట్ల మధు, సూర్య ప్రకాశ్, జ్యోతిబసు, సింహాద్రి, గుండ్ల రాకేశ్, మురళి, మౌలానా, మహేశ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

కోడి కోసం వృద్ధుడి హల్‌చల్

- రోడ్డుకు అడ్డంగా కర్రలు పెట్టి వాహనాలు అడ్డగింత



చనిపోయిన కోడిని చూపుతున్న వృద్ధుడు

పరకాల: తాను ఇష్టంగా పెంచుకున్న కోడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందన్న కోపంతో ఓ వృద్ధుడు హల్‌చల్ చేసిన సంఘటన హనుమకొండ జిల్లా పరకాల పట్టణం రాజీపేటకాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన ఏకు కేశవులుకు చెందిన కోడిపెట్టను గురువారం ఇంటి ఎదుట రోడ్డుపై వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అది చనిపోయింది. ఆ వృద్ధుడు చనిపోయిన కోడితో రోడ్డుపై వాహనాలు వెళ్లనివ్వకుండా కర్రలు పెట్టి ఆందోళనకు దిగాడు. కోడిని ఢీకొట్టిన వాహనం దొరికేంత వరకు కర్రలు తీసేది లేదంటూ వాహనదారులతో గొడవ పడ్డాడు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. చివరకు కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆందోళన విరమించాడు.

అప్పల బాధతో మహిళ ఆత్మహత్య

- కొమ్మాలలో ఘటన




కేత(ఫైల్)

గీసుకొండ: ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీరక, కుటుంబం గడవలేని స్థితిలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. గీసుకొండ పోలీసులు, మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల గ్రామానికి (బతుకుదెరువు నిమిత్తం గతంలో అశోక్‌నగర్ నుంచి కొమ్మాలకు వచ్చింది) చెందిన గజ్జిమేకల కేత(35) గ్రామంలో పొదుపు సంఘం(ఎస్‌హెచ్‌జీ)లో సభ్యురాలు. ఆమె భర్త నాగరాజు హమాలీ పని చేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం పలు బ్యాంకులతో పాటు డ్వాక్రా సంఘాల ద్వారా అప్పు తీసుకుని ఇల్లు నిర్మించుకున్నారు. భర్త ఆదాయం కుటుంబ పోషణకు సరిపోకపోగా.. తీసుకున్న బ్యాంకు లోన్, చిట్టీ డబ్బులు చెల్లించలేని స్థితిలో మనోవేదనతో ఈ నెల 21న పంట చేను వద్ద పురుగుల మందు తాగింది. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. గురువారం మృతురాలి సోదరి గాదం హైమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

ప్రొఫెసర్ సత్యనారాయణకు లైఫ్‌టైమ్ అవార్డు

- నాలుగున్నర దశాబ్దాల విద్యాజీవితం
- 10 పుస్తకాలు, 100 వ్యాసాల రచన



సత్యనారాయణ రచించిన పుస్తకం



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సత్యనారాయణ

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ గట్టు సత్యనారాయణ ఐఎస్ఎస్(ఇండియన్ సోషియాలజికల్ సొసైటీ) లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు–2024 అందుకున్నారు. ఈమేరకు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, ఐఎస్ఐ ప్రెసిడెంట్ మైత్రాయిచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గీతవృత్తిదారులైన చిన్న రైతు కుటుంబంలో జన్మించిన సత్యనారాయణ స్వగ్రామంలోని జెడ్పీఎస్ఎస్‌లో తెలుగు మీడియం పాఠశాల విద్య పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న వరంగల్ జిల్లా కేంద్రంలో ప్రీ–యూనివర్సిటీ కోర్సు, గ్రాడ్యుయేషన్ అభ్యసించారు. సాంఘిక శాస్త్రం, సామాజిక అసమానతలు, సమస్యలపై విచారించే మనస్తత్వం కలిగిన ఆయనకు.. ప్రొఫెసర్లు హసన్ అస్కారీ, రథన్‌సా, లక్ష్మన్న, జి.విశ్వనాథం, జె.వి.రాఘవేందర్‌రావు ప్రోత్సాహం తోడైంది. 'కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు సంబంధించి గ్రామం, పెద్దల పాత్ర' అనే అంశాన్ని ఎంచుకున్న సత్యనారాయణ ఘన్‌పూర్(స్టేషన్) బ్లాక్‌లోని 10 గ్రామాల అధ్యయనం ప్రకారం.. సమీక్షలు అకడమిక్ జర్నల్, ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో ప్రచురితమయ్యాయి. 'తెలంగాణ గ్రామాల అభివృద్ధిపై ఫ్యాక్షన్ ప్రభావం' అనే థీసిస్‌ను ప్రొఫెసర్లు, ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్లు మెచ్చుకున్నారు. నాలుగున్నర దశాబ్దాల విద్యాజీవితంలో ప్రొఫెసర్ జి.సత్యనారాయణ 10 పుస్తకాలను ప్రచురించారు. వాటిలో ఐదు ఆయన రచించినవి, రెండు సంపాదకత్వం వహించినవి, మూడు సహ సంపాదకత్వం వహించినవి ఉన్నాయి. సమకాలీన భారతీయ సమాజంలోని అనేక సమస్యలపై రాసిన సుమారు 100 వ్యాసాలు ఉండగా.. వాటిలో 25 పరిశోధనా వ్యాసాలు వివిధ పత్రికలు–సంపాదకీయ పుస్తకాలలో, 31 ప్రముఖ వ్యాసాలు వివిధ దినపత్రికలలో ప్రచురితమయ్యాయి. ఇంత కాలానికి సరైన అవార్డు లభించడంపై డాక్టర్ సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

'తాజా టిఫిన్స్' ప్రారంభం

- హాజరైన మంత్రి సీతక్క, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



మంత్రి సీతక్కకు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు



ఎంపీ చామల, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరిని స్వాగతిస్తున్న నిర్వాహకులు

జనగామ: వరంగల్–హైదరాబాద్ నేషనల్ హైవేపై జనగామ మండలం పెంబర్తి శివారులో కేసరి ఫెడ్ అండ్ బ్రేవరీజస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'తాజా టిఫిన్స్' హోటల్‌ను గురువారం మంత్రి ధనసరి సీతక్క, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. నిర్వాహకులు తమ్మిశెట్టి సతీశ్, పసునూరి అశోక్‌రెడ్డి అతిథులకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి, ఎంపీ, డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ 'తాజా టిఫిన్స్' హోటల్‌కు వచ్చే కస్టమర్లకు నాణ్యమైన పదార్థాలు అందించి ఆదరాభిమానుల పొందాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, జనగామ పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, నాయకులు ఉన్నారు.

సంవేదనల ప్రతిరూపమే 'నుమాయిష్'



నుమాయిష్ కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కృష్ణదేవరావు తదితరులు

హన్మకొండ కల్చరల్: రచయిత్రి తన జీవితంలో ఎదుర్కొన్న సంచలనాలు, సంవేదనల ప్రతిరూపమే 'నుమాయిష్' అని.. తన ఆలోచనలను చక్కటి కథల రూపంలో వెలువరించారని నల్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కృష్ణదేవరావు అన్నారు. వరంగల్ తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో.. గురువారం హనుమకొండ నయీంనగర్ వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో కవి, రచయిత డాక్టర్ వాణి దేవులపల్లి రచించిన 'నుమాయిష్' కథా సంపుటి ఆవిష్కరణ సభ నిర్వహించారు. ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ కృష్ణదేవరావు ముఖ్య అతిథిగా పాల్గొని కథా సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రచయిత డాక్టర్ వాణి దేవులపల్లిని అభినందించారు. సింగరాజు రమాదేవి పుస్తకాన్ని సమీక్షించారు. సాహితీవేత్త గన్నమరాజు గిరిజామనోహరబాబు, బిల్ల మహేందర్, నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ అశ్విన్, సతీ శ్, శ్రీనివాస్ తదితర కవులు, రచయితలు పాల్గొన్నారు.

అదే రద్దీ.. మారని బుద్ధి!

- ఎంజీఎంలో పేరుకే పది కౌంటర్లు..
- నాలుగింటిలోనే మందుల పంపిణీ



మందుల కోసం వేచి ఉన్న రోగులు

ఎంజీఎం: పేద ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఇటీవల వరంగల్ కలెక్టర్ సత్యశారద మొదటగా ఎంజీఎంలో ఓపీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లను పెంచుతూ.. 10 ఫార్మసీ విభాగం కౌంటర్లను అత్యాధునికంగా సుందరీకరించి అందుబాటులోకి తెచ్చారు. ఈకౌంటర్లను మంత్రి కొండా సురేఖతో కలిసి కలెక్టర్ సత్యశారద ప్రజాపాలన విజయోత్సవాల్లో వైభవంగా ప్రారంభించారు. అప్పటి నుంచి ఫార్మసీ సిబ్బంది కొరత ఉన్నారంటూ ఏడు కౌంటర్లతోనే నడిపిస్తూ వచ్చారు. ఈక్రమంలో ఒకటి, రెండు నెంబర్లున్న కౌంటర్లు అసలే తెరిచిన దాఖలాలే లేవు. కాగా.. గురువారం ఫార్మసీ కౌంటర్లు నాలుగు మాత్రమే తెరిచి ఉండడంతో రోగులు గంటల తరబడి మందుల కోసం వేచి చూడకతప్పలేదు.

ఆలిండియా టోర్నమెంట్‌కు కేయూ జట్టు



కేయూ జట్టుతో స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకయ్య

కేయూ క్యాంపస్: భువనేశ్వర్‌లోని కిస్ యూనివర్సిటీలో ఈనెల 26న ప్రారంభమై 30 వరకు కొనసాగనున్న ఆలిండియా ఇంటర్ వర్సిటీ అథ్లెటిక్స్ టోర్నమెంట్‌లో కాకతీయ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పురుషుల, మహిళల జట్లు పాల్గొననున్నట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య గురువారం తెలిపారు. పురుషుల జట్టులో బి.అంజి (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ హనుమకొండ), ఎం.కోశయ్య (ఎల్‌బీ కాలేజీ, వరంగల్), ఎస్.గోపీచంద్ (కేఎండీసీ, ఖమ్మం), మాలోతు అఖిల్ (ప్రియదర్శిని డిగ్రీ కాలేజీ, కొత్తగూడెం), ఉమెన్ జట్టులో ఎస్‌కె.ఆఫ్రీన్ (కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాల, ఖమ్మం), ఎం.ఇందు (ఎస్‌సీడబ్ల్యూడీసీ, కొత్తగూడెం) ఉన్నట్లు వెంకయ్య తెలిపారు. ఖమ్మం ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీనివాస్‌రావు ఈజట్లకు మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు.